

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన - ఎంసిఎంసి హాలు తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రానున్న 15 రోజుల్లోపు 100 శాతం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎన్నికల అంశాలపై ఆర్ఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టర్ డాక్టర్ జి.సృజన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంతకుముందే కొన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఉంటే వాటిని మినహాయించి మిగిలిన పోలింగ్ కేంద్రాలను కచ్చితంగా వచ్చే 15 రోజుల్లోపు తనిఖీ చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై వివిధ రకాల పథకాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, హోర్డింగ్, బ్యానర్లను తీసి వేసినట్లు 24 గంటల నివేదికలను పంపించారన్నారు. ఎంసిఎంసి ప్రకటనలకు సంబంధించిన ఎస్ఎమ్ఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, టివి ఛానల్‌లో వచ్చే స్క్రోలింగ్లు, అడ్వర్టైజ్‌మెంట్‌లకు ఆ రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలో అనుమతులు తీసుకోవాలన్నారు. జెసి నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, కర్నూలు ఆర్‌డిఒ శేషి రెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై త్వరగా స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. కమ్యూనికేషన్ సెంటర్‌లో సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎంసిఎంసి సెల్‌లో ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాల్లో వచ్చే పెయిడ్ న్యూస్ పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి రిజిస్టర్‌లు నిర్వహించాలని, రోజువారీ నివేదికలను తయారు చేయాలని సూచించారు. డిఆర్ఒ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల స్వీకరణ

కోడ్ ఉల్లంఘన లేదా ఇతర ఫిర్యాదులను వివిధ మాధ్యమాల ద్వారా స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘన లేదా ఇతర ఫిర్యాదులను సి-విజిల్ యాప్‌లో కానీ, హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1950కు కానీ, కర్నూలు జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 7755కు కానీ, కాల్ సెంటర్ 08518-220125కు కానీ, ఎంసిసి మెయిల్ ఐడీస్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసే వారు డిఐపిఆర్ఒబి కర్నూలు ట్విట్టర్ అకౌంట్‌కు ఫిర్యాదును ట్యాగ్ చేయవచ్చని కోరారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా కంట్రోల్ రూం ద్వారా పరిశీలిస్తామన్నారు. తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వెంటనే సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు ఏమైనా ఉంటే కర్నూలు జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 7755కు కానీ, కాల్ సెంటర్ 08518-220125 నెంబర్లకు ఫోన్ చేసి తెలియచేయవచ్చని అన్నారు.



ఎంసిఎంసి హాలును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సృజన

'పది' పరీక్షలు ప్రారంభం

- 810 మంది విద్యార్థులు గైర్హాజరు



కర్నూలులో పరీక్ష కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీగా పరీక్షలను నిర్వహించారు. మొదటి రోజు జరిగిన పరీక్షకు 33,144 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 32,334 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 810 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో జిల్లా పరిశీలకులు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం కలిపి దాదాపు 44 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శ్యామ్యూల్ తెలిపారు. ఏ పరీక్ష కేంద్రంలోనూ విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. **సిబెళగల్** మండలంలోని కొత్తకోట, బెళగల్ మోడల్ స్కూళ్లలో, గురుకులలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎంఇఒ ఆడమ్ బాషా మాట్లాడుతూ... మండలంలో నాలుగు చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, మొదటి రోజు 1,095 మంది విద్యార్థులకు గాను 1,068 మంది హాజరైనట్లు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి పరీక్ష కేంద్రాల్లో సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. **తుగ్గలి** మండలంలో 23 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఇఒ రామ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 665 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా

మిగతా 6వ పేజీలో...



పరీక్ష కేంద్రంలో కూర్చున్న విద్యార్థులు

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అన్నదమ్ముల్లాగా కలిసి ఉన్న దేశ ప్రజల మధ్య కులం, మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ విడదీస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కర్నూలు న్యూ సిటీ ఆల్ యూనియన్స్ (సిఐటియు) సమావేశం జరిగింది. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కె.ప్రభాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా 44 లేబర్ కోడ్‌లను 4 కోడ్లుగా కుదించి యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తోందని విమర్శించారు. కార్మికుల సంక్షేమాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగాలను ప్రయివేట్‌పరం చేస్తోందని విమర్శించారు. ప్రపంచ దేశాల కంటే ఎంతో ప్రాముఖ్యత కలిగిన భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావాలని చూస్తోందని తెలిపారు. ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే ఆదుకోకుండా భారాలు వేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు, చెత్త పన్ను, రైల్వే చార్జీలు తదితర భారాలు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందని తెలిపారు. బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు వైసిపి, టిడిపి ఎంపీలు పార్లమెంటులో మద్దతుగా ఓట్లు వేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్న బిజెపిని, బలపరుస్తున్న నిరంకుశ వైసిపి, అవకాశవాద టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని కోరారు. ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు చిన్న వ్యాపారుల సంఘం సిటీ కార్యదర్శి ఎస్ఎమ్‌డి.రఫీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు జి.ఏసు, మధు, సంజీవ, మోహన్, మల్లి, మిన్నెల్లా, రామచంద్రుడు, నాగన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

అక్రమాల ఆర్‌అండ్‌బి...

- విధులకు దూరంగా ఇంజినీర్లు - పనుల్లో నాణ్యతకు తిలోదకాలు
- పర్సెంటేజీలపైనే అధికారుల చూపు..

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఆర్‌అండ్‌బి కార్యాలయంలో అక్రమాలకు అడ్డు, అదుపు లేదన్న ప్రచారం సాగుతోంది. ఎవరు పర్సెంటేజీ ఎక్కువ ఇస్తే వారి ఫైల్‌కు మోక్షం లభిస్తోందన్న విమర్శలున్నాయి. ముడుపులు ముట్టజెప్పనదే ఏ ఫైలూ ముందుకు కదలదని పేర్కొంటున్నారు. ప్రధానంగా ఆదోని, సిరుగుప్ప రోడ్డుతో పాటు, అక్కడక్కడ ప్యాచ్ వర్క్‌లోకి సంబంధించి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసింది. నిబంధనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో వ్యవహారాలు సాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగి తేలుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పర్సెంటేజీ ఇస్తే క్షేత్రస్థాయిలో పనులు ఎలా జరిగాయో కూడా చూడకుండానే ఆమోదం తెలుతుపున్నారని ప్రచారం సాగుతోంది. ఫలితంగా అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలకు అంతులేకుండా పోతోంది. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన ఆ శాఖ ముఖ్య అధికారిపైనా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి.

చుట్టపు చూపు...

ఆర్‌అండ్‌బి కార్యాలయంలో పని చేసే డిఇలు చుట్టపుచూపుగా కార్యాలయానికి వస్తున్నారు. ఫీల్డ్‌కు వెళ్లారని కిందిస్థాయి సిబ్బంది చేత చెప్పిస్తున్నారే కానీ, విధులకు డుమ్మా కొడుతున్నారని సమాచారం. మచ్చుకు కూడా కనిపించని డిఇలు కూడా ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విధులకు హాజరుకాని వారికి వేతనాలు ఇవ్వడం దండగ అని పలువురు విమర్శిస్తున్నారు.



ఆర్‌అండ్‌బి కార్యాలయం

అక్కడ దందా..?

కార్యాలయంలో అవినీతి దందా నడుస్తోందన్న విమర్శలు వినిస్తున్నాయి. పనులకు సంబంధించి పర్సెంటేజీలను అక్కడే మాట్లాడుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. ఓ డిఇకి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం లేదని, అయినా మొత్తం తతంగాన్ని నడిపిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారి కార్యాలయానికి వచ్చినప్పుడు సైతం పనుల గురించి కాకుండా, పర్సెంటేజీల గురించే చర్చ నడుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. అలా పర్సెంటేజీలు ముట్టజెప్పిన వారి ఫైల్స్‌పై మాత్రమే సంతకాలు చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

నాణ్యతకు తిలోదకాలు

జరుగుతున్న పనుల్లో నాణ్యత పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇష్టానుసారంగా రోడ్లు వేసి పోవడం, పర్సంటేజ్ ఇచ్చిన వారికి బిల్లులు చేస్తున్నారని వివిధ గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.



మాట్లాడుతున్న క్యాంపు ఆఫీసర్ గురువయ్య శెట్టి

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమైనట్లు క్యాంపు ఆఫీసర్, ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి తెలిపారు. సోమవారం నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. ఈ సందర్భంగా గురువయ్య శెట్టి మాట్లాడారు. రోజూ మూల్యాంకనానికి హాజరయ్యే అధ్యాపకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా క్యాంపులో ఉండాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 15 జవాబు పత్రాలు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 15 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రయివేటు జూనియర్ కళాశాలలకు చెందిన అధ్యాపకులను మూల్యాంకనంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అలా చేయకపోతే సంబంధిత కళాశాలపై రోజువారీగా రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 420 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌కు గాను 294 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ బాషా, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు సుంకన్న, సురేష్, చంద్ర, నాగభూషణం రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

'మీరే వైద్యం చేసుకోవచ్చు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నగరంలోని లలిత కళాసమితిలో డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి రచించిన 'మీరే వైద్యం చేసుకోవచ్చు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సోమవారం పుస్కకావిష్కరణ సభలో జెవివి అధ్యక్షులు డాక్టర్ ఎం.నాగరాజు, నంది అవార్డు గ్రహీత మహ్మద్ మియా, పత్తి ఓబులయ్య, వి.బ్రహ్మారెడ్డి, శేషాద్రిరెడ్డి, జంధ్యాల రఘుబాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : ఎస్పీ

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ కోరారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పందిపాడు, ఇందిరమ్మ కట్ట, ఓల్డ్ కల్లూరులో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు నాలుగో పట్టణ సిఐ శంకరయ్య, ఎస్ఐలు మోహన్ కిశోర్, సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పూలబజార్, బండిమెట్ట, చత్రభాగ్, గనిగల్లి, పెద్ద రంగరాజు స్ట్రీట్, చిత్తారివీధి, రాంబొట్ల దేవాలయం, గడ్డ స్ట్రీట్, జమ్మిచెట్టు, కమేలా, పెద్ద పడఖానాలో కవాతు నిర్వహించారు. కర్నూలు ఒకటో పట్టణ సిఐ పవన్ కుమార్, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.




కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్, పోలీసు కాలనీకి చెందిన వైసిపి నాయకులు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్, పోలీసు కాలనీ కల్లూరు ఎస్టేట్‌లో వైసిపికి చెందిన బోయ గిరి, తలారి కృష్ణ నాయుడుతో సహా 100 కుటుంబాలు వైసిపి వీడి గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో టిడిపిలో చేరారు. గౌరు దంపతులు టిడిపి కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్తీక్ కుమార్ రెడ్డి, వెంకి సాయినాథ్ రెడ్డి, అశోక్, సాయి సందీప్, రంజిత్ రెడ్డి, రామాంజనేయులు, సురేంద్ర, బోయ అశోక్, వేణుగోపాల్ రెడ్డి, గిరి కృష్ణ, శీను, ఇసాక్ బాషా, ఉపేంద్ర, లోకేష్, భూపాల్ నాయుడు, శ్రీకాంత్, కృష్ణ, వరుణ్ టిడిపి చేరారు. కల్లూరు మండల వార్డు ఇన్‌ఛార్జీ టైలర్ నాగ రాజు, ఖాజా బందే నవాజ్, కల్లూరు మండల అధ్యక్షులు డి.రామాంజనేయులు, శేఖర్ చౌదరి, నరేష్ కుమార్ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. కల్లూరు అర్బన్ 36వ వార్డు వాసవీ నగర్‌కు చెందిన 100 కుటుంబాలు వార్డు ఇన్‌ఛార్జీ రెడ్డిగారి తిరుమలేష్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గౌరు వెంకట రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి గౌరు వెంకటరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బి.చిన్న పెద్దయ్య, ఓబులేసు, లక్ష్మన్న, సుబ్బరాయుడు బ్రదర్స్, రాముడు, నిజాం సాహెబ్, హుస్సేన్ బాష, వీరన్న గౌడ్, మధుసూదన్, వేణుగోపాల్ చేరారు. అర్బన్ వార్డు ఉపాధ్యక్షులు పెద్ద బీచుపల్లి, కురువ ధనుంజయ, చిన్న బీచుపల్లి పాల్గొన్నారు.



గౌరు దంపతుల సమక్షంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

ఘనంగా అశోకా ఈ-క్యూబ్ కార్నివాల్

- పారిశ్రామిక వేత్త టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

దూపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ-క్యూబ్ ఉమెన్స్ కార్నివాల్ సంబరాలు కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 'అశోకా 16వ కాలేజ్ డే'తో ఘనంగా ముగిశాయి. సోమవారం కళాశాల క్యాంపస్‌లో నిర్వహించిన 16వ 'కాలేజ్ డే' సెలబ్రేషన్స్‌కు ముఖ్యఅతిథిగా పారిశ్రామికవేత్త టిజి.భరత్ హాజరయ్యారు. అకడమిక్ టాపర్స్, ఇతర కాంపిటేటివ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అశోకా కళాశాల విద్యార్థులు సాధిస్తున్న విజయాలు, ప్లేస్‌మెంట్స్ ఎంతో అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు వినోదం, ఎంపవర్‌మెంట్ అందించేలా సాగే ఇలాంటి ఈ-క్యూబ్ కార్నివాల్స్ ఎంతో దోహదపడతాయని చెప్పారు. అశోకా కళాశాల సిఇఒ డాక్టర్ హరీష్ కృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్ మాట్లాడుతూ... నేటి తరంలో తమ అశోకా అమ్మాయిలు విద్య, వినోదం, ఎంటర్‌టైన్‌మెంట్, ఎంపవర్‌మెంట్‌లో అబ్బాయిలతో పోటీ పడి రాణించే తత్వాన్ని అలవరచుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ 'కార్నివాల్' నిర్వహిస్తున్నామని తెలిపారు. వారం రోజులపాటు జరిగిన కార్నివాల్‌లో నూతన ఆవిష్కరణలకు నాందీ పలుకుతూ పోటీతత్వాన్ని అలవరిచే 'అశోకా ఆవిష్కార్', యువతరాన్ని ఉర్రూతలూగించే 'మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్', డిజె, స్పోర్ట్స్ కల్చరల్ కాంపిటీషన్స్‌లో భాగంగా కాంపిటీషన్, సింగింగ్, డ్యాన్సింగ్, మిస్ అశోకా, ట్రెజర్ హంట్, ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లు నిర్వహించినట్లు చెప్పారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న టిజి.భరత్

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- డిసిసి అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ప్రధాని మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేస్తూ ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రజాధనాన్ని అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేట్‌పరం చేయడానికి సిద్ధమైన బిజెపికి దేశ ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. మోడీ హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వానికి అంట కాగుతున్న టిడిపి, జనసేన, వైసిపి అభ్యర్థులను ఓడించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసి పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామస్వామి, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, పిసిసి అధికార ప్రతినిధి బి.రామాంజనేయులు, పిసిసి సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, డిసిసి ఉపాధ్యక్షులు బి.బతుకన్న, రియాజుద్దీన్, దిలీప్ దోక, బి.మహేంద్ర నాయుడు, ఎవి.నాయుడు, ప్రధాన కార్యదర్శి బి.నీలకంఠప్ప, పోతుల శేఖర్, కె.సత్యనారాయణ గుప్త, ఎన్.చంద్రశేఖర్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు కొత్తపేట మున్నా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ.లాజరస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎస్.ప్రమీల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపిని గెలిపించాలి

- టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటపతి

ప్రజాశక్తి - తుగ్గలి



రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించాలని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటపతి కోరారు. సోమవారం కొత్తపల్లి గుడిసెల్లో స్థానిక గిరిజనులతో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. గత టిడిపి హయాంలో గిరిజనుల అభివృద్ధి కోసం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అనేకమంది నిరుద్యోగులకు రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజనులకు ఎలాంటి రుణాలూ ఇవ్వలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తామని తెలిపారు. పత్తికొండ నియోజకవర్గంలో కెఇ.శ్యాంబాబును గెలిపించేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు.

పిజి సెమిస్టర్‌కు 90 శాతం హాజరు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న పిజి కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షకు సోమవారం 90 శాతం హాజరు నమోదయింది. మొత్తం 558 మంది విద్యార్థులకు గాను 53 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి గోకారమయ్య ఉరుసు

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని బురాన్‌దొడ్డిలో మంగళవారం నుంచి గోకారమయ్య ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, గురువారం కిస్తీ ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాయకుల కసరత్తు

గ్రామంలో ఉరుసు సందర్భంగా నీటి సమస్య తలెత్తకుండా గ్రామ పెద్దలు శరత్ కుమార్, మోహన్ బాబు సమాచారం మేరకు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌సి రెడ్డిగారి శేఖర్ రెడ్డి, ఇఇ శైలేశ్వర్ రెడ్డి, డిఇ లక్ష్మణ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అర్జున్‌లు ఎల్ఎల్‌సి నుంచి కుంటను నీటితో నింపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

టికెట్ నాకే వస్తుంది.. అధైర్య పడొద్దు

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం నియోజకవర్గం నుంచి టిడిపి టికెట్ తనకే వస్తుందని, పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయాన్ని పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు గత పదేళ్లుగా అండగా ఉంటున్న తనకు తప్ప మరెవరికీ టికెట్ ఇవ్వడానికి ఆస్కారం లేదన్నారు. ఎమ్మెల్యే కోవర్టుకు పార్టీ అధిష్టానం టికెట్ ప్రకటించడం వెనుక చంద్రబాబు చుట్టూ జగన్ కోవర్టులు ఉండి ఈ పని చేయించినట్లు తెలుస్తోందని తెలిపారు. తప్పుడు సర్వేలతో అధిష్టానాన్ని పక్క దారి పట్టించారని చెప్పారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలు అందించిన వారికి కాకుండా వైసిపి నుంచి వలస వచ్చిన వారికి టికెట్ ఇవ్వడాన్ని సీనియర్లు వ్యతిరేకిస్తూ తనకు మద్దతు ఇస్తున్న అంశం అధిష్టానానికి తెలిసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో విషయంలో తప్పు చేయడం సహజమని, పార్టీ అధిష్టానం కూడా తప్పు చేసి ఉండవచ్చని, అది త్వరలో సరిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల, గ్రామ స్థాయిలో నాయకులు తనకు టికెట్ రాకపోవడంపై ఆవేదన చెందుతున్నారని తెలిపారు. అందుకే ప్రతి మండల కేంద్రంలోనూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అది కేవలం టిడిపిపైనా, తనపైనా అభిమానంగా అధిష్టానం చూడాలన్నారు. నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు త్వరలో చంద్రబాబును, లోకేష్‌ను అచ్చెన్నాయుడుల ముందు తన బలగంతో బల ప్రదర్శన చేస్తున్నట్లు చెప్పారు. తనకే టికెట్ వచ్చి తీరుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తానని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు కొ్రటేష్ గౌడ్, భరద్వాజ్ శెట్టి, లక్ష్మీకాంత్ రెడ్డి, అశోక్, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టేప్ప గారి నరసింహ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దాం

- వైసిపి యువ నాయకులు చంద్రశేఖర్


మేము సిద్ధం కిట్లను పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రంలో వైసిపి గెలుపే లక్ష్యంగా ముందుకు పోదామని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్ కార్యకర్తలను కోరారు. సోమవారం ఆస్పరితో పాటు జొహరాపురం, హాలిగేర, చిగిలి గ్రామాల్లో 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని బూత్ సభ్యులు, బూత్ కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ నిరంతరం ప్రజల్లోనే ఉండాలని సూచించారు. వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షిని గెలిపించి జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. అంతకుముందు చంద్రశేఖర్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన, కెడిసిసి జిల్లా బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు, జెసిఎస్ మండల కన్వీనర్ బసవ, చంద్రశేఖర్, నాయకులు కేశవ రెడ్డి, లక్ష్మి నారాయణ, మహానంది, రాజన్న గౌడ్, కౌలుట్ల, ప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

టిబి లక్షణాలపై అవగాహన

ఆదోని : పట్టణంలోని శంకర్ నగర్‌లోని సచివాలయం మ్యాక్ సెంటర్‌లో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సోమవారం టిబి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిక, డాక్టర్ షైనాజ్ బేగం, ఎంపిహెచ్‌ఎస్ బాబురాజు మాట్లాడారు. టిబిహెచ్‌వి సుబ్బమ్మ బాయి, లలితమ్మ, ఎస్‌టిఎస్ స్వరూప్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

5వ పేజీ తరువాయి...

642 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. **ఆదోని** డివిజన్‌లో సోమవారం మొదటి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందే విద్యార్థులను అనుమతించారు. లోపలకు వెళ్లేటప్పుడు చాలా పకడ్బందీగా విద్యార్థులను పోలీసులే తనిఖీ చేసి లోపలికి పంపారు. మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బయటనే తనిఖీ చేసి పంపడం వల్ల కొంత ఆలస్యం అవుతుందేమోనన్న ఆందోళనకు విద్యార్థులు గురయ్యారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, ఇతర ఎలాంటి వస్తువులను అనుమతించలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న తాగునీటి బాటిళ్లను సైతం బయట ఉంచారు. డివిజన్‌లోని 84 పరీక్ష కేంద్రాల్లో 16,745 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉడగా 499 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సౌకర్యం కల్పించామన్నారు. **గోనెగండ్ల** మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 720 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కావాల్సి ఉంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎ, బి పరీక్షా కేంద్రాలు, మండల పరిషత్ బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలో 1, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 1 మొత్తం 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. మొదటిరోజు ప్రారంభమైన తెలుగు పరీక్షకు 697 మంది విద్యార్థులు హాజరు కాగా, 23 మంది గైర్హాజరయ్యారని అన్నారు. వారంతా ప్రయివేట్‌గా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులేనని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు కేంద్రాల వద్ద గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. **చిప్పగిరి**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు 287 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్‌ఎమ్‌డి.ఫరూక్, డిపార్ట్‌మెంటల్ అధికారి రంగస్వామి తెలిపారు. మండలంలో 293 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 10 మంది విద్యార్థులు ప్రయివేట్ రాస్తున్నట్లు చెప్పారు. వారిలో ఆరుగురు గైర్హాజరు కాగా 287 మంది హాజరయ్యారన్నారు. నిబంధనలను అనుసరించి 10వ తరగతి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చిప్పగిరి ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. **నందవరం**లో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎంఇఒ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... మండలం లో మొత్తం 605 మంది విద్యార్థులు రెగ్యులర్‌గా పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. నందవరం, నాగలదిన్నె, కనకవీడు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో 421 మంది విద్యార్థులు రెగ్యులర్ గాను, 168 మంది ప్రయివేట్ గాను పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 339 మంది విద్యార్థులు, కెజిబివిలో 130, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎపిఎంఎస్ ముగతి 89, ముగతి ఉన్నత పాఠశాలలో 58 మంది విద్యార్థులు, ఎమ్మిగనూరు పట్టణంలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో, ఇబ్రహీంపురం ఉన్నత పాఠశాలలో 37 మంది విద్యార్థులు, మంత్రాలయం లో పరీక్షలు రాస్తున్నారన్నా రు. తెలుగు పరీక్షకు రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులు కలిపి 464 మందికి గాను 448 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల చీఫ్ ఎగ్జామినర్స్ నరసప్ప, భోజరాజు, లచ్చప్ప, డిపార్ట్‌మెంట్ అధికారులు హెచ్.ఈరన్న, యుఎం.రాజశేఖర్, రంగస్వామి పాల్గొన్నారు. **కౌతాళం**లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కౌతాళంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రెండు సెంటర్లు, ప్రతిభ హై స్కూల్, కస్తూరిబాయ్ బాలికల గాంధీ పాఠశాల, జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 878 విద్యార్థులకు గాను 850 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. **ఆస్పరి**లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో-ఎలో 182 గాను 172 మంది, బిలో 165 గాను 159 మంది, విజేత పాఠశాలలో 131 గాను 127మంది, జూనియర్ కళాశాలలో 173 గాను 169 మంది, కస్తూర్బా పాఠశాలలో 101 గాను 98 మంది విద్యార్థులు హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. **హోళగుంద**లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. హోళగుందలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎ, బి సెంటర్‌లో పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. 'ఎ' సెంటర్‌లో మొత్తం 192 మందికిగాను ఏడుగురు గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కబీర్ సాబ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ బసవరాజు, సిట్టింగ్ స్క్వాడ్ ఎంహుసేని తెలిపారు. 'బి' సెంటర్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌గా రమణయ్య విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, కన్నడ, ఉర్దూ పరీక్ష రాశారని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఆదోని డిప్యూటీ డిఇఒ వెంకటరమణయ్య హాజరై విద్యార్థులను పరిశీలించారు.


ఆదోని మున్సిపల్ పాఠశాల కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


గోనెగండ్లలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు


కౌతాళం మండలంలో...


నందవరం మండలంలో...


ప్రచారం నిర్వహిస్తున్న విరుపాక్షి

ప్రజల ఆశీస్సులతో గెలుస్తాం

- వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి -ఆలూరు

ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు తన గెలుపు తథ్యమని వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి తెలిపారు. సోమవారం మండలంలోని కరిడిగుడ్డం, ముద్దనగేరి, కురుకుంద గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడారు. జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపిస్తాయని తెలిపారు. అనంతరం కురుకుంద గ్రామ వైసిపి సీనియర్ నాయకులు అంగడి భీమయ్య ఆధ్వర్యంలో బి.విరుపాక్షి టిడిపి ఎంపిటిసి ఏసన్న, శ్రీనివాసులుకు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, సర్పంచి దేవరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం వైసిపికి రెండు కళ్లు

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, సంక్షేమం వైసిపి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ 24వ వార్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. బుట్టా రేణుక వెంట ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు ప్రచారంలో ఉన్నారు. వీరిద్దరికీ వార్డు ఇన్‌ఛార్జీ రుద్రాక్షల బజారి ఆధ్వర్యంలో వార్డు ప్రజలు అడుగడుగున నీరాజనాలు పలికారు. శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేసి, పూలమాలలతో సన్మానించి అభిమానం చాటుకున్నారు. బుట్టా రేణుక ప్రచారానికి వార్డులో విశేష స్పందన లభించింది. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, పట్టణ అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్, రాష్ట్ర షాప్ నెట్‌వర్క్ ఛైర్మన్ మాచాని వెంకటేష్, కౌన్సిలర్లు రామాంజినమ్మ, డిష్ కేశవరెడ్డి, ఆదెప్ప, శంకర్, నాగరాజు ఉన్నారు.


బుట్టా రేణుకకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైసిపి గెలుపు అవసరం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని, అవి కొనసాగాలంటే వైసిపి గెలవాలని బుట్టా రేణుక కుమారుడు బుట్టా ప్రతూల్ తెలిపారు. పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తనూ కలుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలకున్న సమస్యలు విన్నారు. రానున్న ఎన్నికల్లో బుట్టా రేణుకను గెలిపించాలని కోరారు. 6వ వార్డు కౌన్సిలర్ శివ ప్రసాద్, 5వ వార్డు కౌన్సిలర్ ఆమాన్ పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - నందవరం

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. సిఐ మోహన్ రెడ్డి వివరాల మేరకు... తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన బోయ క్యాతూరు వీరేశ్, బోయ కొండగాళ్ల లక్ష్మన్నలు కర్ణాటక రాష్ట్రం తలమారి గ్రామానికి చెందిన వీరేష్ వద్ద కర్ణాటక మద్యం ప్యాకెట్లను కొనుగోలు చేశారు. రెండు మోటార్ సైకిళ్లపై తీసుకొస్తుండగా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న మొత్తం 1,920 జాన్స్ ఒరిజినల్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే కర్ణాటక రాష్ట్రం చిన్నమంచాల గ్రామానికి చెందిన బోయ లింగప్ప నుంచి గిల్క సుగుర్ క్యాంపు నుంచి కర్ణాటక మద్యం ప్యాకెట్లను తీసుకొస్తుండగా వ్యక్తిని అరెస్టు చేశారు. నదికైరవాడి ఊరు బయట తుంగభద్ర నది ఒడ్డున నందవరం ఎస్ఐ, సిబ్బందితో వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద ఉన్న 1,152 జాన్స్ ఒరిజినల్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం తీసుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న సిఐ, ఎస్ఐ

ఆదోనిలో అంతర్ రాష్ట్ర సెపక్ తక్రా పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

రాయలసీమ విశ్వవిద్యాలయం, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంయుక్తంగా ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్ తక్రా పోటీలు సోమవారం ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో రెండో రోజూ కొనసాగాయి. ముఖ్య అతిథిగా రాయలసీమ ఉప కులపతి ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, మాజీ కరస్పాండెంట్ విశ్వనాథ రెడ్డి క్రీడాకారులను పరిచయ చేసుకున్నారు. రెండో రోజు ఎపిజె అబ్దుల్ కలాం విశ్వ విద్యాలయంపై ఎంజెపిఆర్ బరెలి విశ్వ విద్యాలయం, శ్రీకుషల్ దాస్ విశ్వ విద్యాలయంపై అన్న విశ్వ విద్యాలయం, చెన్నై, మాధవ్ యూనివర్సిటీ పింద్వారాపై ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, గొండావాన్ యూనివర్సిటీపై రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు జట్లు విజయం సాధించాయి. కళాశాల ఛైర్మన్ విట్టా సతీష్, వైస్ ఛైర్మన్ డాక్టర్ విజయ లక్ష్మి, కరస్పాండెంట్ దైవదీనం రెడ్డి, మాజీ కరస్పాండెంట్లు శ్రీనివాస రెడ్డి, తిమ్మారెడ్డి, బసవన్న గౌడ్, సత్య నారాయణ రెడ్డి, సనత్ కుమార్, ప్రిన్సిపల్ మురళీ మోహన్, విశ్వ విద్యాలయం నుంచి శివకిషోర్, ముత్తయ్య, కల్యాణ్ కుమార్, చంద్ర శేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు, కంబీ రెడ్డి పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న సిబ్బంది


నివాళులర్పిస్తున్న నాయకులు

టిడిపి కార్యకర్త మృతికి నాయకుల నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నీహళ్లి గ్రామానికి చెందిన తెలుగు ముద్ద రాముడు భార్య మల్లమ్మ (65) మృతదేహానికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రఘునాథ్ రెడ్డి నివాళులర్పించారు. మల్లమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డి మల్లమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాముడు కుటుంబానికి ఎన్.రామిరెడ్డి కుటుంబంతో పాటు టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. టిడిపి చెట్నీహళ్లి నాయకులు మేకల మల్లేష్, చాపల మహానంది, భీమరాయుడు, కురువ నాగేంద్ర, చిన్న మల్లేష్ నాగేష్ ఉన్నారు.

జంపాపురంలో గుండు, ఇసుక బస్తాలు ఎత్తే పోటీలు

ప్రజాశక్తి - మంత్రాలయం

కోసిగి మండలం జంపాపురం గ్రామంలో బహిరంగ గుండు, ఇసుక బస్తాలు ఎత్తే పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సి.ఈరన్న, బసవరాజు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21న శ్రీబసవేశ్వర రథోత్సవం సందర్భంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు బలంగా, దిట్టంగా ఉండాలని, గుండు, ఇసుక బస్తాలు ఎత్తే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిర్వాహకులకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పారు. గుండు ఎత్తే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5,016లను దాత టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, రెండో బహుమతి రూ.3,016లను దాత టిడిపి యువ నాయకులు ఎన్.రామకృష్ణారెడ్డి అందజేస్తారని తెలిపారు. అలాగే ఇసుక బస్తాలు ఎత్తే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5,016 దాత టిడిపి సీనియర్ నాయకులు, కోసిగి మాజీ సర్పంచి ముత్తు రెడ్డి, రెండో బహుమతి 3,016 దాత టిడిపి కోసిగి పట్టణ అధ్యక్షులు చింతలగేని నర్సిరెడ్డి ఇస్తారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు సందేహాల నివృత్తికి 9505302075, 62005395706 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న మరివీడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... చిన్న మరివీడు గ్రామంలో గ్రామదేవర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కురువ అయ్యస్వామి (42) తన బావమరిది ఏర్పాటు చేసుకునే చెరుకు రసం యంత్రానికి విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

అరకొర సౌకర్యాల నడుమ

పది పరీక్షలు ప్రారంభం

- 93.85 శాతం విద్యార్థులు హాజరు - ఎస్‌పిజి కేంద్రంలో ఫ్యాన్‌లు, తాగునీరు కరువు
- కేంద్రాలను కలెక్టర్, ఎస్‌పి తనిఖీ - వసతుల లేమిపై ఆగ్రహం
- గాజులపల్లిలోని కేంద్రం వద్ద పెట్టని నోటీసు బోర్డు - హాల్ టికెట్ నంబర్ల వెతుకులాటలో సమయం వృధా

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లాలో అరకొర సౌకర్యాల మధ్య పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించామని, పక్కాగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో స్థానిక అధికారులు విఫలమయ్యారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌పిజి హైస్కూల్‌లో పదో పరీక్షలకు 11 గదులను కేటాయించగా 7 గదుల్లో ఫ్యాన్‌లు లేక ఉక్కపోతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకపోవడం కొసమెరుపు. మరోపక్క పైకప్పు పెచ్చులు ఉడిపోయో గదులలో విద్యార్థులు పరీక్షలు రాశారు.

93.85 శాతం విద్యార్థులు హాజరు : నంద్యాల జిల్లాలో మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా జరిగింది. జిల్లాలోని 134 పరీక్షా కేంద్రాలలో 25,945 మంది విద్యార్థులకు గాను 24,350 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1,595 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 5 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 28 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. స్టేట్ అబ్జర్వర్ ఆర్ఎస్ గంగ భవాని 6 కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 36 పరీక్షా కేంద్రాలను పరీక్షల యంత్రాంగం తనిఖీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించండి : కలెక్టర్

జిల్లాలో 10వ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు వెల్లడించారు. నంద్యాల పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్పీజీ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో సరైన సౌకర్యాలు లేకపోవడం, వాహనాలు అడ్డంగా పెట్టడం పట్ల అక్కడి సిబ్బంది పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడ పేపర్ లీకేజైనా క్యూఆర్ కోడ్‌తో గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. భవిష్యత్తులో జరిగే పరీక్షలు కూడా ప్రశాంతంగా నిర్వహిం చేందుకు అన్ని రకాల జాగ్రత్త **మిగతా 6వ పేజీలో...**



నంద్యాలోని ఎస్‌పిజి పరీక్షా కేంద్రంలోని గదిలో ఫ్యాన్‌లు లేక ఉక్కపోతతో అల్లాడుతున్న విద్యార్థులు



మహానంది : గాజులపల్లెలోని కేంద్రంలో నోటీస్ బోర్డు పెట్టకపోవడంతో హాల్ టికెట్ నంబర్ల కోసం తిరుగుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నంద్యాలలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

బిజెపితో పొత్తు రాష్ట్రానికే వినాశకరం

- టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఆత్మకూర్

బిజెపితో టిడిపి, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడం రాష్ట్రానికి వినాశకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ పొత్తు రాష్ట్ర అభివృద్ధికి విఘాతమన్నారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకమని, రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపితో పొత్తు పెట్టుకోవడం విశ్వాస ఘాతుకానికి పాల్పడటమేనని విమర్శించారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం విస్తృత సమావేశం మండల కార్యదర్శి నరసింహ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోదా ఇవ్వకుండా నిరాకరించిన బిజెపితో భాగస్వామిగా ఎన్‌డిఎలో చేరుతున్నామని చంద్రబాబు ప్రకటించడం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని చెప్పారు. రాష్ట్ర ప్రజలతో తిరస్కరించబడిన బిజెపితో ఎందుకు పొత్తు పెట్టుకున్నారో టిడిపి ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు దేశమంతా తిరిగి బిజెపి విద్రోహాన్ని, మతోన్మాదాన్ని ఎండగట్టి నేడు అదే బిజెపితో కలిసి ఇప్పుడు రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తానని నమ్మబలకటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. మత విద్వేషాలు రగిలించి మైనార్టీల మీద దాడులు చేస్తున్న బిజెపితో కలిసి మైనార్టీలను ఎలా ఆదుకుంటుందని, దళితులకు ఏం సమాధానం చెబుతుందని దళిత, ఆదివాసీ, బలహీన వర్గాలను ఎలా ఉద్ధరిస్తుందని, స్టీల్‌ప్లాంటును మూసేయడానికి యత్నిస్తున్న బిజెపితో కలసి రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దుతామంటే తెలుగు ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మహిళలకు ఏం సమాధానం చెబుతారో టిడిపి వివరించాలని డిమాండ్ చేశారు. టిడిపి బిజెపికి పూర్తిగా లొంగిపోయి ఆ పార్టీ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని, అనేక రాష్ట్రాల్లో అనుభవాలను చూస్తే బిజెపితో పొత్తు ధృతరాష్ట్ర కౌగిలి వంటిదేనని రుజువైందన్నారు. 2014లో బిజెపితో పొత్తు పెట్టుకొని ఏమి సాధించారో టిడిపి శ్రేణులకు చంద్రబాబు చెప్పాలని, ఆ పార్టీ కార్యకర్తలు ఈ పొత్తును వ్యతిరేకించా లన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని రాష్ట్ర ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, నాయకులు రజాక్, స్వాములు, రామ్ నాయక్, సంజీవరాయుడు, సురేంద్ర, ఇస్మాయిల్, సి.వెంకటేశ్వర్లు, మాబాష, సుధాకర్, పుల్లమ్మ, అక్కమ్మ, సువర్ణమ్మ, వీరన్న, కిరణ్, చాంద్, దాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలి

- జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున నోడల్ అధికారులకు అప్పగించిన విధులను అప్రమత్తంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పోలింగ్ విధుల నిర్వహణకు కాంట్రాక్ట్ సిబ్బంది మినహా ఇంకా ఏదేని శాఖల సిబ్బందిని గుర్తించి మంగళవారం సాయంత్రంలోగా ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారులను ఆదేశించారు. రాండమైజేషన్ పద్ధతిలో విధులు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రెనింగ్ షెడ్యూల్‌ను పక్కాగా రూపొందించుకోవాలని ట్రెనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లకు కేటాయించే వీడియో గ్రాఫర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో కారణాలు విశ్లేషించి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వృద్ధ, వికలాంగ, సర్వీస్ ఓటర్లకు వర్తించే పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై కూడా ట్రెనింగ్ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల పరిశీలన నిమిత్తం వచ్చే అబ్జర్వర్లకు వసతి, లైజన్ ఆఫీసర్ల కేటాయింపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సివిల్ సప్లైస్ డిఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ పద్మజ, అన్ని కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

అహోబిలంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

- ఎగువలో గరుడ విమాన పల్లకిలో యోగానంద నరసింహస్వామి
- దిగువలో హంస వాహనంపై ప్రహ్లాద వరదుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అహోబిలం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఎగువ అహోబిలంలో జ్వాల నరసింహస్వామి గరుడ విమానంలో యోగానంద నరసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా గరుడ విమానంలో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం అహోబిల ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి జ్వాల నరసింహ స్వామి హనుమంత వాహనంపై కొలువు దీరాడు. పూజలు నిర్వహించిన అనంతరం భాజా భజంత్రీల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో : దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయదారుల పూజలు అనంతరం హంస వాహనంపై కొలువుదీరిన ప్రహ్లాద వరద స్వామి ఆలయ మాడవీధుల గుండా అహోబిలం మఠం వద్దకు చేరుకున్నారు. మఠం వద్ద పీఠాధిపతి స్వామికి పూజలు నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరదస్వామి సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో జిపిఎ సంపత్, ఓఎస్‌డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అహోబిలంలో : పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం జ్వాలా నరసింహస్వామి ఉదయం శేష వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తారని కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ తెలిపారు. దిగువ అహోబిలంలో ఉదయం గరుడ విమానంపై, రాత్రి హనుమంత వాహనంపై ప్రహ్లాద వరద స్వామి దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



హంస వాహనంలో కొలువైన ప్రహ్లాద వరదుడికి పూజలు చేస్తున్న పీఠాధిపతి



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్న ప్రహ్లాద వరద స్వామి



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాషా

ముమ్మాటికి రాజకీయ హత్యే : మాజీ సర్పంచి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి గ్రామ పంచాయతీ వేలంపాటలో జరిగిన గొడవల్లో చనిపోయిన ఇమామ్‌ది ముమ్మాటికి రాజకీయ హత్యేనని మాజీ సర్పంచి, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎంఎస్ అన్సర్ బాషా అన్నారు. ఆయన మాట్లాడుతూ సోమవారం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గేట్లు వసూళ్ల వేలం పాటలో జరిగిన గొడవల్లో ఇమామ్‌ను పథకం ప్రకారమే హత్య చేశారన్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధం రాజకీయ నాయకుడు ఇంటి సమీపంలో దొరకడం అందుకు నిదర్శనమన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దోషులను శిక్షించాలి తప్ప వారికి అండగా నిలబడరాదని కోరారు. భయభ్రాంతులకు గురి చేసి ఓట్లు దండుకోవాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, దౌర్జన్యాలకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మౌలాలి, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అనీఫ్, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుత్తి నరసింహుడు, బాధితులు ఉన్నారు.

'పల్లె వెలుగు' ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి-డోన్ : ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు డోన్ నుండి కర్నూల్‌కు పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించిన ప్రయాణికులకు బహుమతులు అందజేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సులలో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్ నందు ప్రయాణికులు తమ టికెట్ వెనకాల వారి పేరు, ఫోన్ నెంబరు రాసి వేసిన వారికి నేడు డ్రా తీయశామని, గిఫ్ట్ బాక్స్ స్కీములో ఎంపికైన ముగ్గురు ప్రయాణికులు మొదటి బహుమతి డోన్ శ్రీనివాసులు, రెండో బహుమతి లద్దగిరి దీవన్న, మూడవ బహుమతి డోన్ రమణబాబులకు బహుమతులు అందజేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.



బహుమతులను అందిస్తున్న డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్

చాపిరేవులలో వైసిపి ఖాళీ : ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో వైసిపి నాయకులు సైకిల్ ఎక్కడంతో ఆ పార్టీ ఖాళీ అయిందని నంద్యాల టిడిపి అభ్యర్థి ఎన్ఎండి.ఫరూక్ పేర్కొన్నారు. వైసిపి నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బిజ్జల బాలస్వామి రెడ్డి, అతని కుమారుడు బిజ్జల శేఖర్ రెడ్డి, అనుచరులు ఫరూక్ ఆధ్వర్యంలో సోమవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఫరూక్ వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం అయిందన్నారు. ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు. గ్రామాలను, టౌన్‌లను అభివృద్ధి చేసింది టిడిపి అన్నారు. ప్రజలందరూ గమనించి ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చాపిరేవుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



టిడిపి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎన్ఎండి ఫరూక్

జగన్ పాలనలో ఎపి సర్వనాశనం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం అయిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. సోమవారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని సాయి నగర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాగళం కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు. జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎపి మొత్తం ఎదురుచూస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులు అమడాల మద్దిలేటి, నాయకులు బివి ప్రసాద్ రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, గువ్వల సుబ్బారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, మురళి, రాజశేఖర్, జనసేన నాయకులు గుర్రప్ప, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి పూలమాల వేస్తున్న మహిళలు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని బోధనం, సింగవరం గ్రామాల్లో బండి ఆత్మకూరు ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రధాన కూడలిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్సై మల్లికార్జున మాట్లాడారు. గ్రామంలో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలకు, అల్లర్లకు పాల్పడవద్దని, సామరస్యంగా పాల్గొనాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్యేక పోలీస్ బలగాలు, లోకల్ పోలీసులు పాల్గొన్నారు. **వెలుగోడు :** రానున్న సార్వత్రిక ఎన్నికలు-2024 దృష్ట్యా మండలంలోని రేగడగూడూరు, వేల్పనూరు, అబ్దుల్లాపురం గ్రామాలలో బిఎస్ఎఫ్ డిఎస్‌పి ఫంగజ్ కుమార్, వెలుగోడు ఎస్ఐ భూపాలుడు కవాతు నిర్వహించి ఎన్నికలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాస రావు, ఆత్మకూరు రురల్ సిఐ నాగభూషణం సూచనాల మేరకు గ్రామాలలో కవాతు నిర్వహించామన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఆయా గ్రామాల ప్రజలకు ఎలక్షన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా ఆవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించారు.



బండి ఆత్మకూరు : సమస్యాత్మక గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



వెలుగోడు : సమస్యాత్మక గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



మినరల్ వాటర్‌ను పాఠశాలకు అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.శాలిని ప్రకాష్

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు మినరల్ వాటర్ ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, పాతపేట జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.శాలినిప్రకాష్ తెలిపారు. సోమవారం కుమార్, ఆర్కే ఫ్రెండ్స్ ఆర్థిక సహకారంతో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.శాలినిప్రకాష్, పాఠశాల హెచ్ఎం.పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, హెచ్ఎం మైమున్నీసా విద్యార్థులకు మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపుగా 1000 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, వేసవిని దృష్టిలో ఉంచుకొని వారికి మినరల్ వాటర్ అందించేందుకు కృషి చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తామని తెలిపారు. మినరల్ వాటర్ అందించడానికి ఆర్థిక సహకారం అందించిన కుమార్, ఆర్కే ఫ్రెండ్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి : సమాజంలో ఉన్న అమ్మాయిలు చట్టాలు తెలుసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని నందికుంట గ్రామంలో ఉన్న పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ వివక్షత చూపకుండా ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీలు రాఘవేంద్ర, ప్రసాద్, మహిళా పోలీస్ మోతియా బేగం, పాఠశాల హెచ్ఎం శ్రీసుధా, సోషల్ వెల్ఫేర్ సంపూర్ణ, అంగన్వాడి కార్యకర్తలు శ్రీదేవి, పద్మావతి, శ్రావణి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్



కేకు కట్ చేస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

మూడేళ్ల కౌన్సిల్ పాలన విజయవంతం

ప్రజాశక్తి-డోన్

మూడేళ్ల కౌన్సిల్ పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలలో డోన్ మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామని సంతోషం వ్యక్తం చేశారు. 32 వార్డులలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు మల్లికార్జున్ రెడ్డి, నాగేంద్ర, ఆర్ట్ రమణ, నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ గౌడ్, యూత్ అధ్యక్షుడు రాజ వర్ధన్ గౌడ్, వైసిపి నాయకులు రాజేంద్రనాథ్, మణి మోహన్ రెడ్డి, వంశీ, కుళ్లాయప్ప, సతీష్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు 3 కేజీల జొన్నలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులందరికీ బియ్యం బదులు 3 కిలోల జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాగి పిండి ఒక్క కార్డుకు కిలో రూ. 11లకు పంపిణీ చేస్తారన్నారు. మార్చిలో 767.790 మెట్రిక్ టన్నుల జొన్నలు 2,89,996 మంది కార్డుదారులు బియ్యంకు బదులుగా 3 కేజీల జొన్నలను తీసుకున్నారని తెలిపారు. కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిజాయతీపరులను గెలిపించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా నిజాయతీ పరులకు ఓటు వేసి గెలిపించాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథ జిల్లా నాయకుడు వై.ఈశ్వరాచారి పేర్కొన్నారు. సోమవారం సుండిపెంట కాలనీలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఓటును అమ్ముకోవద్దని, నిజాయతీని నిజాయతీతో గెలిపిద్దామన్నారు. ఒక్కసారి మహోన్నత త్యాగాలను గుర్తు చేసుకోవాలని, డబ్బుకు, మద్యానికి, ప్రలోభాలకు గురి కావద్దని, నిజాయతీ పరులకు ఓట్లేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు.

శివాలయం నిర్మాణానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - పాములపాడు : పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలోని నూతన శివాలయం నిర్మాణానికి నిర్మాణ కమిటీ సభ్యులు వైసిపి మండల అధ్యక్షుడు జి రామలింగేశ్వర రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా సోమవారం అందజేశారు. నిర్మాణ కమిటీ సభ్యులు రామలింగేశ్వర్ రెడ్డిని దుశ్శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రామలింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు.



రామలింగేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న శివాలయం నిర్మాణం కమిటీ సభ్యులు

నందికొట్కూరులో 'రాజధానిలో ఒకడు' సినీ బృందం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలో చిన్నయ్య క్రియేషన్స్ 'రాజధానిలో ఒకడు' చిత్ర బృందం సభ్యులు సోమవారం సందడి చేశారు. డైరెక్టర్ డైరెక్టర్ సుభాష్ బాబు మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణ పరిసర ప్రాంతాలలో దాదాపు 80 శాతం సినిమాను పూర్తి చేయడానికి పలు ప్రాంతాలను పరిశీలించామని చెప్పారు. ఈ సినిమా ప్రేక్షకులను ఆకర్షించే విధంగా కొత్త స్టోరీని తీసుకొని మంచి కథతో ప్రేక్షకుల ముందుకి అతి త్వరలో తీసుకొస్తామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. సినిమాలో ప్రముఖ హాస్య నటులు బాబు మోహన్, జబర్దస్త్ టీం సభ్యులు నటిస్తున్నారని తెలిపారు. చిత్రానికి సంబంధించిన షూటింగ్ మొదట హైదరాబాదులో ప్రారంభించామని, దాదాపు 80 శాతం నందికొట్కూరులో పూర్తి చేయడానికి వచ్చామన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ అరవింద అగర్వాల్, నటులు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు, సాయి ప్రసాద్, రజాక్, రమణ, డాక్టర్ మారుతి సహకారం, నరేంద్రరెడ్డి, రమణ, ఇర్ఫాన్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ సుభాష్ బాబు

అక్రమ బదిలీలను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె : అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ ఆడిట్ జిల్లా కన్వీనర్ దస్తగిరి, జిల్లా సహ అధ్యక్షులు సత్య ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎన్ ప్రతాప్ ఆధ్వర్యంలో అక్రమ బదిలీలపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం అక్రమ బదిలీలు చేపట్టడం సరికాదన్నారు. వెంటనే అక్రమ బదిలీల సిఫారసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా అక్రమ బదిలీలు చేపట్టడం వలన నాణ్యమైన విద్య లభించదని వాపోయారు. ఉపాధ్యాయులు వద్దని చెబుతున్న అక్రమ బదిలీలు, 117 జీవో రద్దు, అప్రెంటీస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.సతీష్, ఆర్.వీర కుమార్ రెడ్డి, బి సుధాకర్, వై సుంకన్న, వై మనోహర తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ' స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో ఉన్న ప్రతిభ యూపీ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు పూర్తి వ్యతిరేకంగా పాఠశాలను నిర్వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షుడు పి.మగ్రిస్వామి అన్నారు. సోమవారం వారు పాఠశాలను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. రేకుల షెడ్డులో విద్యాసంస్థ నడపరాదని నిబంధన ఉన్నా నడుపుతున్నారని, అప్పర్ ప్రైమరీ నిబంధనల ప్రకారం 1వ అంతస్తు లో పాఠశాల ఉండరాదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, దుస్తులు అమ్ముతున్నారని, క్వాలిఫై టీచర్స్ లేకుండా విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తున్నారని చెప్పారు. పాఠశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోని సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోకేష్, ఖాదర్ భాష, ఇంతియాజ్ భాష పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం టిడిపితోనే సాధ్యం : గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

సంక్షేమ రాజ్యం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పాణ్యం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ పాలనలో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయారని, సంక్షేమ రాజ్యం కావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు బిడుదురి సీతారామరెడ్డి, పంట రామచంద్రారెడ్డి దుర్వేసి కృష్ణ యాదవ్, బిలకల గూడూరు ఎస్.ఏ.రఫీక్, గని హర్ష, కరిమద్దల ఈశ్వర్ రెడ్డి, యువ నాయకుడు గంజెర్ల గణేష్ రెడ్డి, ఐ టిడిపి బివిఎన్ రాజు, కొర్రపోలురు జయన్న, షణ్ముఖ రెడ్డి, ఫారుక్, బిలకల గూడూరు సుదర్శన్ రెడ్డి, ఒడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరితా రెడ్డి


బుడ్డా రాజశేఖర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎన్నికల్లో శ్రీశైలం టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రీశైలం నియోజవర్గం సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరులోని టిడిపి కార్యాలయంలో క్లస్టర్ స్థాయి జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. బిసిలకు గత టిడిపి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, రాబోయే ప్రభుత్వం బిసిలకు ఎన్డీయే కూటమి అందించే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వైఫల్యాలను బన్నూరు రామలింగ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు రామ నర్సయ్య, దగ్గుపాటి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రవీంద్ర బాబు, నాగార్జున, నగరి లక్ష్మి, రుతమ్మ, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వేణు గోపాల్, క్లస్టర్ ఇన్చార్జి మల్లికార్జున రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, వెంకట్రావ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బన్నూరు రామలింగారెడ్డి



నివాళులర్పిస్తున్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

మాజీ ఎంపిపి సోదరుడు మృతి

- డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి నివాళి

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్యాపిలి మండలం మాజీ ఎంపిపి టి.శ్రీనివాసులు సోదరుడు శాంతానాయుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలిసిన డోన్ టిడిపి అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి శాంతానాయుడు మృతదేహానికి నివాళి లర్పించారు. కుటుంబానికి టిడిపి ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, డోన్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శేషన్న గౌడ్, మల్లేశ్వరమణ, చంద్రప్రభ్ ఆచారి, లక్ష్మీనారాయణ యాదవ్, గండికోట రామసుబ్బయ్య, మామిళ్లపల్లి మోహన్, కోదండ రామయ్య యాదవ్, ఖాజా పీరా, కొంగనపల్లి మధు, కిరణ్ యాదవ్, చల్లా అనుదీప్, మెట్టుపల్లి సుంకన్న, హర్ష, రాచర్ల శ్రీరాములు, చంద్రపల్లి సందీప్, వార్డ్ మెంబర్ వెంకటేష్, పెద్ద పూజల గోపాలు, మహేష్, గండికోట రమేష్, గుడిపాడు రాజు, శంకర్, వెంకట్, రాముడు, వెంగలాంపల్లి పరమేష్, కుళ్లాయప్ప, శేఖర్,అక్బర్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలో మోటార్ సైకిలును ఆటో ఢీ కొట్టిన సంఘటనలో కొండప్ప నాయుడు (55) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై నిరంజన్ రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన కొండప్ప నాయుడు మోటార్ సైకిల్‌పై గాజులపల్లె వైపు వెళుతుండగా ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మృతి చెందిన కొండప్ప నాయుడు

గుండెపోటుతో వ్యక్తి హఠాన్మరణం

- నివాళులర్పించిన సర్పంచి నాయిని సావిత్రమ్మ

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన షేక్ మునాఫ్ (61) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, వైసిపి మండల కార్యదర్శి మధుసూదన్ రావు, నాయకులు మద్దిలేటి, ఉపేంద్ర, జనార్ధన్, గ్రామ పెద్దలు మనోహర్ తదితరులు మునాఫ్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సర్పంచి మాట్లాడుతూ మునాఫ్ భార్య ప్రస్తుతం జూటూరు గ్రామ నాలుగో వార్డ్ మెంబర్‌గా కొనసాగుతున్నారని అన్నారు. మునాఫ్ సైతం గతంలో వార్డ్ మెంబర్‌గా గ్రామానికి సేవలు అందించారని, ఆయన మరణం కుటుంబానికే కాదు గ్రామానికి కూడా తీరనిలోటన్నారు.



నివాళులర్పిస్తున్న సర్పంచి సావిత్రమ్మ, నాయకులు



బజ్జీలు వేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వినూత్న రీతిలో మాజీ ఎమ్మెల్యే బిసి ప్రచారం

ప్రజాశక్తి - బనగానపల్లె : కోయిలకుంట్ల పట్టణంలో మాజీ ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డి వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం కోయిలకుంట్ల పట్టణంలో బజ్జీలు వేస్తూ చిన్న వ్యాపారులతో మమేకమై ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

సమయపాలన తప్పనిసరి : తహశీల్దార్

ప్రజాశక్తి - రుద్రవరం : సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెండు, మూడు గ్రామ వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది తప్పనిసరిగా సమయం పాలన పాటించాలని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుకు సత్వర పరిష్కారం చూపే దిశగా సచివాలయ సిబ్బంది మెలగాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 'ఇఫ్తార్ మీట్'

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక క్యాంపస్ హైస్కూలులో 'ఇఫ్తార్ మీట్' నిర్వహించారు. జమాఅతె ఇస్లామి నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్ ఉపవాస దీక్ష గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చింతల మోహనరావు, కాంగ్రెస్ చింతలయ్య, ఏపి, టిఎస్ క్రిష్టియన్స్ జేఏసి కన్వీనర్ ఫాస్టర్ మణ్యం జానయ్య, మాజీ కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, సిరి సూపర్ మార్కెట్ అధినేత సురేష్, జేఐహెచ్ జిల్లా బాధ్యులు జకరియా, దాయి ముహమ్మద్ ఫరూఖ్, క్యాంపస్ స్కూలు కరెస్పాండెన్స్ ఖలీల్, ఆసీఫ్, జానోజాగో మహబూబ్ బాషా, వెల్ఫేర్ పార్టీ అన్సార్, జమాఅత్ పెద్దలు యూఎఫ్డి కన్వీనర్ అలీం, ఎస్ఐఒ, ఐవైయం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం కూటమి సభ అట్టర్ ఫ్లాప్ : వైసిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం కూటమి సభ అట్టర్ ఫ్లాప్ అయిందని వైసిపి తాలూకా నాయకులు భూమా కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని స్వగృహంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు కేవలం జగన్మోహన్ రెడ్డిని సిఎం కాకుండా చేయాలని ఆలోచన తప్ప అమ్ముడు పార్టీలు కలిసి రాష్ట్రానికి ఏం చేస్తాయో చెప్పలేదన్నారు. ఆ మూడు పార్టీలకు రాష్ట్రానికి ఉపయోగపడే ప్రణాళిక ఏమీ లేదని, కేవలం జగన్మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో సిఎం కాకుండా ఆపడమే వాటి అజెండా అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి వచ్చి పోలవరం ప్రాజెక్టు, కడప స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ గురించి, రాష్ట్రంకు అవసరమైన పరిశ్రమల గురించి ఎక్కడ మాట్లాడలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే తాము మూడు పార్టీలు పొత్తులు పెట్టుకున్నామని ఎక్కడా చెప్పలేదన్నారు. టిడిపి బిజెపితో పెట్టుకున్న పొత్తు రాష్ట్రం బాగు కోసం కాదని, చంద్రబాబు అవినీతి కేసుల్లో జైలుకుపోకుండా రక్షణ కోసమని విమర్శించారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా, ఎన్ని కూటములు పెట్టుకున్నా జగన్‌ను ఎవరూ ఆపలేరన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి జెండా ఎగరడం ఖాయమన్నారు.



మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరుతున్న టిడిపి నాయకులు

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని 15 కుటుంబాల వారు సోమవారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సమక్షంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సుదర్శన ఆచారి, కళ్యాణ్ బాబు, సిద్దు, భార్గవ్, నాగేంద్ర, మద్దిలేటి, సామీర్, మున్నప్, మన్సూర్ బాబు, షరీఫ్ బాషా తో పాటు మరో 15 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా నాయబ్ రసూల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ఆళ్లగడ్డ అభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరారన్నారు. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ఏ సమస్య వచ్చినా స్పందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. గతంలో లాగే తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, కేకే తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి ఆళ్లగడ్డ : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేక వాహనాలు, పోలీస్ బందోబస్తు అప్పగించారు. తాసిల్దార్ నజీర్ అహ్మద్ ఫ్లైయింగ్ స్పాట్ సభ్యులు ప్రసాదు, రామ్మోహన్ రెడ్డి, మహబూబ్ బాషా, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - బనగానపల్లె : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుదామని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నందివర్గం ప్రాథమిక పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 96 మంది విద్యార్థులకు వివిధ రకాల జ్ఞానదాయకమైన పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ప్లాస్టిక్ వాడటం వలన కలుగు నష్టాలు-పర్యావరణం వల్ల కలుగు లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ సంటెన్న, రాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెచ్చెరువు గిరిజన గూడెంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ఆత్మకూరు మండలం పెచ్చెరువు గిరిజన గూడెంలో కొట్టాలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సుప్రవళిక గర్భిణులకు హెచ్‌బి, బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్, సిహెచ్ఒలు గర్భిణీలకు ఐరన్ మాత్రలు, పిల్లలకు టీకాలు, సికిల్ సెల్ రక్త పరీక్షలు చేశారు. టిబి సూపర్వైజర్ రవి కుమార్ బిసిజి టీకా వేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన వారిని గుర్తించారు. క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఒలు విజయలక్ష్మి, తులసి, మల్లిక, మౌనిక, హెల్త్ అసిస్టెంట్ సామక్క, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యం : మాజీ ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ: బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యమవుతుందని దొర్నిపాడు మాజీ ఎంపిపి భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సందీప్ రెడ్డి, దొర్నిపాడు మాజీ సర్పంచ్ చెలూంగారి అంకన్న యాదవ్ అన్నారు. దొర్నిపాడు మండల కేంద్రంలోని బిఎన్ఆర్ వేర్హౌస్ గోడౌన్ లో జయహో బీసీ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మల్లేశ్వర చౌదరి, ప్రసాద్, నారాయణ , లక్ష్మీ నరసింహ యాదవ్, అశోక్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే అర్జునాపురం గ్రామంలో టిడిపి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి అఖిలప్రియను గెలిపించాలని కోరారు. ప్రెసిడెంట్ భూమా ప్రభాకర్ రెడ్డి, వడ్లమూడి మల్లేష్ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వైసిపి నాయకుడు మృతి

- ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని నగళ్ళపాడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రామస్వామి రెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని రామస్వామి రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైసిపి నాయకులు రాముడు, బ్రహ్మానందరెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

అరకొర సౌకర్యాల నడుమ

పది పరీక్షలు ప్రారంభం

5వ పేజీ తరువాయి... చర్యలు తీసుకోవాలని డిఇఒకు సూచించామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలను శాంతియుతంగా నిర్వ హించేందుకు అవసరమైన పోలీసు బందోబస్తుతో పాటు మహిళా పోలీస్ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144వ సెక్షన్‌తో పాటు జిరాక్స్ సెంటర్లను మూసివేయించినట్లు తెలిపారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి, గోకవరంలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ రామసుబ్బయ్య, ఎస్సార్ బీసీ స్పెషల్ డిప్యూటీ తహసిల్దార్ ధర్మేంద్ర ఫణి తనిఖీ చేశారు. కొత్తపల్లి పరీక్ష కేంద్రంలో 184 మంది విద్యార్థులకు గాను 154 మంది హాజరయ్యారు. గోకవరంలో 105 మందికి గాను 84 మంది విద్యార్థులు హాజరయ ్యారు. పరీక్షల నిర్వహణ అధికారులుగా ఇబ్రహీం, రఘు స్వామి, డిపార్ట్మెంటల్ అధికారులు సురేందర్ సింగ్, ఖాజా మొయిద్దీన్ ఉన్నారు. పరీక్ష కేంద్రాలను కొత్తపల్లి ఎస్సై హరిప్రసాద్ తనిఖీ చేశారు. **పగిడ్యాల :** మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 192 మంది విద్యార్థులకు గాను 6 మంది గైర్హాజరయ్యారు. ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 117 మంది విద్యార్థులకు గాను 9 మంది, పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 174 మంది విద్యార్థులకు గాను 4 గైర్హాజరయ్యారు. ఎగ్జామ్స్ చీఫ్‌లు మధుసూదన్ రావు, ఎల్లనాయుడు, సలీం, డిపార్ట్మెంటల్ ఎగ్జామ్స్ రషీద్ మియ్య, వెంకటరామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో, మోడల్ స్కూల్, సంత జూటూరు జిల్లా పరిషత్ పాఠశాలలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 518 మంది విద్యార్థులకు గాను 72 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఇఒ మోహన్ రెడ్డి తెలిపారు. **మహానంది :** మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ స్కూల్, గాజులపల్లిజడ్పీహెచ్‌ఎస్ స్కూల్, క్రీస్తు జ్యోతి హై స్కూల్‌లలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తిమ్మాపురం గ్రామంలోని జడ్పీహెచ్ హైస్కూల్ నందు నోటీస్ బోర్డు పిల్లర్ స్థంభానికి పైన చిన్నగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తరగతి గదులకు వెలుపల వైపు నోటీస్ బోర్డ్ అంటించకుండా తలుపులకు అంటించడంతో అక్కడ కూడా విద్యార్థుల పరీక్షా సమయం వృధా అయింది. బెంచ్‌లపై దుమ్ము ధూళి కూడా శుభ్రం చేయకుండా అపరిశుభ్రంగా ఉంచారని విద్యార్థులు వాపోయారు. గాజులపల్లి జడ్పీహెచ్ హైస్కూల్ వద్ద నోటీస్ బోర్డులు ఉంచకపోవడంతో విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్లు వెతుకులాటలో సమయం వృధా కావడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 4 కేంద్రాల్లో 687 మంది విద్యార్థులకు గాను 627 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. కేంద్రాలను నంద్యాల రూరల్ సిఐ శివకుమార్ రెడ్డి పరిశీలించారు. **రుద్రవరం :** రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరసాపురంలోని థామస్ మార్తోమా పాఠశాలలో 467 మంది విద్యార్థులకు గాను 417 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. **గడివేముల :** గడివేముల మండలంలో మొత్తం 411 మంది విద్యార్థుల గాను 316 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 19 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ రసూలుల్లా ఖాన్ తెలిపారు. ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు పట్టణంలోని 7 కేంద్రాలలో 1472 మంది విద్యార్థులకు గాను 1361మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 111 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఇఒ జానకిరామ్ తెలిపారు. **పాములపాడు :** పాములపాడులోని మోడల్ స్కూల్‌లో జరిగిన పరీక్షలకు 198 మందికి గాను 188 మంది, జడ్పీ హైస్కూల్‌లో 247 మందికి గాను 221 విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ బాలాజీ నాయక్ తెలిపారు. 36 మంది గైర్హాజరయినట్లు చెప్పారు. **బనగానపల్లె :** మండలంలోని నందివర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపురం సమీపంలోని విద్యానికేతన్, పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రియదర్శని హై స్కూల్ ఎస్‌వి చైతన్య హైస్కూల్ పరీక్షా కేంద్రాలలో 1942 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఇఒ స్వరూప తెలిపారు.